క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ థౌర్యా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస కాలనీ, టీచర్స్ కాలనీ, మర్లు, వడ్డెరబస్తీ, బీకేరెడ్డి కాలనీల్లో ఉదయం 8నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చౌడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



జడ్చర్ల టౌన్:మండలంలోని బూర్గుపల్లిలో యాదవుల కుల దేవత చౌడమ్మ విగ్రహాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా యజ్ఞం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి.. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆదివారం బోనాల ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయాదవ్, మల్లేశ్, బైకని రాములు, శ్రీను, శ్రీశైలం, దశరథం, బుచ్చయ్య,నర్సింహులు,భరత్‌కుమార్ పాల్గొన్నారు.

కూలి డబ్బులు చెల్లించాలి

దేవరకద్ర: ఉపాధి హామీ పథకంలో ఎనిమిది వారాలుగా పనిచేస్తున్న కూలీలకు కూలి డబ్బులు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని సీపీఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు సాంబశివుడు అన్నారు. శనివారం కొకుంట్లలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఆయన మాట్లాడారు. కూలీలకు రోజువారీ కూలి రూ. 320 రావాల్సి ఉండగా.. రూ.160 మాత్రమే వస్తున్నాయన్నారు. కూలీలకు ఇంత తక్కువ కూలి గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. కూలీలకు పెంచిన కూలి మేరకు డబ్బులు అందించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను చెల్లించాలని, పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి



రాజాపూర్: పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి.. సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రంగారెడ్డిగూడలో ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డా.భరత్ భూషణ్‌రావు, కె.కళ్యాణి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు, భూసారం పెంపునకు సేంద్రియ ఎరువులు ఎంతో దోహదపడుతాయన్నారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి.. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రదీప్‌గౌడ్, ఉద్యానశాఖ అధికారి మహేందర్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శేఖర్‌గౌడ్, ఏఈఓ దీపికాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

మహబూబ్‌నగర్ క్రైం/జడ్చర్ల: జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 ఫర్టిలైజర్ దుకాణాల్లో శనివారం ఎస్‌ఐ శీనయ్య, ఏఓ మురళి సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విత్తనాల, ఎరువుల స్టాక్, ప్యాకెట్స్‌పై ఉన్న లేబుల్స్, నోటీసు బోర్డు, ఇన్, ఔట్ వర్డ్, క్యూఆర్ కోడ్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

❐ జడ్చర్ల పట్టణంలోని 10 ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాసిరకం, అనుమతి లేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు పూర్తి వివరాలతో కూడిన బిల్లులను అందించాలని సూచించారు. విత్తనాల నిల్వలు, ధరలను రైతులకు అర్థమయ్యే విధంగా బోర్డుపై రాయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనివాస్, గోపీనాథ్, ఎస్‌ఐ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాతకు అకాల కష్టం

- నవాబుపేట మార్కెట్‌యార్డులో వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం
- వర్షపు నీటిలో ధాన్యం కొట్టుకుపోకుండా రైతుల అవస్థలు



నవాబుపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న మహిళా రైతులు

నవాబుపేట: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. యాసంగి పంట అంటేనే కత్తిమీద సాములా మారింది. రైతులు వరిసాగు చేశాక భూగర్భజలాలు తగ్గడంతో కొంతమేర పంట ఎండిపోయింది. ఎంతో మంది రైతులు పశువులకు వదిలేశారు. బోరుబావుల నుంచి అందిన కొద్దిపాటి నీటితో మిగిలిన పంటను పండిస్తే ఆకాల వర్షాలు ఆందోళన కలిగించాయి. ఇలా ఇబ్బందులు పడుతూ.. పంట కోసి విక్రయానికి మార్కెట్‌కు తీసుకువస్తే సకాలంలో కొనుగోలు కాక అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుంది. అష్టకష్టాలు పడి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాకుండా పోయాయి. తాజాగా శనివారం నవాబుపేట మార్కెట్‌యార్డులో ఆరబోసిన వెయ్యి బస్తాలకు పైగా ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయింది. వర్షపునీటిలో ధాన్యం కొట్టుకుపోకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. తేమశాతం ఎక్కువగా ఉందని ఆరబోస్తే.. చివరకు వర్షంతో తీరని నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో షడ్లు ఉండగా.. అందులో కేవలం వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం మాత్రమే నిల్వ చేస్తున్నారు. రైతులు ఆరుబయటే ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. దీంతో చినుకు పడితే చాలు ధాన్యం మొత్తం తడిసిపోతుంది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పనికి రాని గన్నీ బ్యాగులు..

నవాబుపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగుల కొరత తీర్చాలని నిర్వాహకులు సంబంధిత అధికారులను కోరగా.. ఇటీవల 4వేల గన్నీ బ్యాగులను పంపించారు. అయితే వాటిలో 80 శాతానికి పైగా గన్నీ బ్యాగులు రంధ్రాలు పడి ధాన్యం నింపేందుకు వీలు లేకుండా ఉన్నాయి. పనికిరాని గన్నీబ్యాగులను అధికారులు పరిశీలించకుండా పంపించడంతో రైతులకు అక్కరకు రాకుండా పోయాయి. ఈ విషయమై మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం స్పందిస్తూ.. జిల్లా అధికారులతో మాట్లాడి మంచి గన్నీబ్యాగులను తెప్పిస్తామని తెలిపారు.



నవాబుపేట కొనుగోలు కేంద్రంలో పనికిరాని పాత గన్నీ బ్యాగులు

స్తంభాన్ని సరిచేశారు..

సాక్షి ఎఫెక్ట్..



అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లి నుంచి నిజాలాపూర్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం ఓవైపునకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. దీనిపై శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. విద్యుత్ స్తంభాన్ని వెంటనే సరిచేయాలని జానంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ కిరణ్‌కుమార్ సిబ్బందిని పురమాయించారు. ఈ మేరకు విద్యుత్ సిబ్బంది సాదిక్ అక్కడికి వెళ్లి ఓ వైపునకు ఒరిగిన స్తంభాన్ని సరి చేయించారు. స్తంభాన్ని సరిచేయించిన విద్యుత్‌శాఖ అధికారులకు స్థానిక రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుకు ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం కావేరమ్మపేటలోని 1వ వార్డు, బాదేపల్లిలోని 20వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చిత్తశుద్ధితో పార్టీలకు కతీతంగా ఇళ్లు లేని నిరుపేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 3,500 మందికి ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామంటూ గారడీ చేశారని విమర్శించారు. కాగా, బాదేపల్లి సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణపై కొందరు రాజకీయం చేయడం తగదని ఎమ్మెల్యే అన్నారు. దాదాపు 50 శాతానికి పైగా పనులు పూర్తయిన తర్వాత అఖిలపక్షం అంటూ.. రాజకీయ డ్రామాలకు తెరతీయడం సరికాదన్నారు. మొదటగా అధికారులు రూపొందించిన డిజైన్‌ను ఎవరి స్వలాభం కోసం మార్చారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఆమోదించిన డిజైన్‌ను ఇప్పుడు వారే ఆక్షేపించడం ఏమిటని మండిపడ్డారు. విస్తరణ పనుల్లో ఒకవైపు ఎక్కువగా.. మరోవైపు తక్కువగా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి డిజైన్‌ను గత ఎమ్మెల్యే ఎందుకు ఆమోదించారో ఆయనకే తెలియాలని అన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేసేందుకు తాము పోరాడుతున్నామని.. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యం



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్/హన్వాడ: పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో 76 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. హన్వాడ మండల కేంద్రంతో పాటు సల్లోనిపల్లి, నాగినోనిపల్లి, పల్లె మోనికాలనీ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను ఆపడం లేదన్నారు. పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన వీడియో జర్నలిస్టు తౌహిద్ మృతదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

❐ హన్వాడ మండలంలోని బుద్దారంలో నిర్వహించిన పోచమ్మ, బొడ్రాయి, నాగుల విగ్రహాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ శివారులో కొలువైన పోచమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ కార్యదర్శులు కృష్ణయ్య యాదవ్, వి.కృష్ణయ్య, మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, మహేందర్, సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాంచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, ఫయాజ్, అవేజ్ అహ్మద్, గోవింద్ యాదవ్, సంజీవ్‌రెడ్డి, మోయిజ్, రఘు, ప్రసాద్, శ్రీనివాసులు, పీర్ సాధిక్, చెన్నయ్య, నవనీత, రమేశ్, బొట్టు శ్రీను, మాజీ ఎంపీటీసీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్యదక్షుడికి సన్మానం



మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలో మహబూబ్‌నగర్ అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డిని కీలక పాత్ర పోషించారు. ఇందుకు గాను శనివారం దేవేందర్‌ను కలెక్టరేట్ పరిపాలనా విభాగం అధికారి శంకర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఘనపాటిగా పేరు గాంచిన దేవేందర్.. ట్రెసా కార్యవర్గం ఎన్నిక కోసం చేసిన కృషిని ఈ సందర్భంగా ఏఓ కొనియాడారు. కార్యక్రమంలో ట్రెసా నూతన అధ్యక్షుడు సి.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి ఖలీద్ ఎక్బాల్, మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ సుందర్‌రాజ్ పాల్గొన్నారు.

జడ్చర్ల క్రాస్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్



జడ్చర్ల టౌన్: పట్టణంలోని క్రాస్‌రోడ్డులో శనివారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే దాక భారీగా ట్రాఫిక్‌జాం అయ్యింది. సాయంత్రం చిరుజల్లులు కురవడంతో ఒక్కసారిగా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వాహనాలు నిలిచిపోయాయి. అప్పటి నుంచి రాత్రి 8గంటల వరకు ట్రాఫిక్‌జాం సమస్య కొనసాగుతూనే ఉంది. అటు హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు, ఇటు పట్టణం నుంచి వెళ్లే వాహనాలు, మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలతో క్రాస్ రోడ్డు పూర్తిగా వాహనాలమయంగా మారింది. ట్రాఫిక్‌జాం సమస్య తీర్చేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఎప్పుడు ఎక్కడ ట్రాఫిక్ జాం అవుతుందో తెలియక పట్టణవాసులతో పాటు వాహనదారులు సతమతమవుతున్నారు.

ముగిసిన శిక్షణ

జడ్చర్ల టౌన్/భూత్పూర్: ఐదు రోజులుగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఎస్జీటీలకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జడ్చర్ల మండల ఉపాధ్యాయులకు, బాదేపల్లి హైస్కూల్‌లో మిడ్జిల్ మండల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ మంజులాదేవి పర్యవేక్షించారు. భూత్పూర్ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చిన ఆర్పీలతో పాటు ఎంఈఓ ఉషారాణిని టీపీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో యాదయ్య, సాయిరాంగౌడ్, దస్తయ్య, సురేందర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

గండేడ్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జక్లపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిరుపేదకు ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎంపీడీఓ దేవన్న, పంచాయతీ కార్యదర్శి వెంకట్రాములు, పుల్లారెడ్డి, గోపాల్, హౌసింగ్ డీఈ పుష్పలత, వెంకట్రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, నర్సింహులు, రఘు, వెంకన్న పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చిన్నచింతకుంట:కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి.. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి కోరారు. శనివా రం మండలంలోని అల్లీపూర్, మద్దూర్, కురు మూర్తి గ్రామాల్లో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తు న్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యక ర్త పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్, సురేందర్‌రెడ్డి,ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో బొడ్రాయి (గ్రామ దేవత) బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు చేరుకొని ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రశాంత్‌రెడ్డి, నారణ్‌రెడ్డి, రవి, రాజేందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బంగారు పాల్గొన్నారు.

'పాతబజార్‌ను పాడుబడనివ్వం'



సమావేశమైన అఖిలపక్ష నాయకులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని పాతబజార్‌ను పాడుబడనీయకుండా కాపాడుకుంటామని అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశంలో పట్టణ ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. సిగ్నల్‌గడ్డ నుంచి పాతబజార్‌కు భారీ వాహనాల రాకపోకలకు అనుమతి లేకుండా రోడ్డు విస్తరణ చేపట్టడం తగదన్నారు. హైవేతో రంగారావుతోట, పాతబజార్, చైతన్యనగర్, పద్మావతి కాలనీతో పాటు బూరెడ్డిపల్లి, ఆలూరు గ్రామాలకు స్కూల్ బస్సులు, ఇతర భారీ వాహనాలు రాకుండా పోతాయని ఆవేదన వ్యక్తంచేశారు. అభివృద్ధి అంటే పట్టణాలు, గ్రామాల ప్రజలకు మేలు జరిగేలా ఉండాలని.. జాతీయ రహదారితో రవాణా సౌకర్యం పూర్తిగా నిలిచిపోయే పరిస్థితులు రాకుండా ఉండాలని అభిప్రాయపడ్డారు. బాదేపల్లి పాతబస్టాండ్‌కు బస్సులు, భారీ వాహనాలు వచ్చే అవకాశం లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాతబజార్ ప్రాంతానికి యథావిధిగా రాకపోకలు సాగించేలా రోడ్డు డిజైన్ మార్చాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ.. జాతీయ రహదారి నిర్మాణంతో పాతబజార్ వాసులకు అన్యాయం జరగకుండా చూస్తానన్నారు. ఈ విషయంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని చూసి.. ఉదయమే నేషనల్ హైవే అథారిటీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఎమ్మెల్యే చెప్పారు. సిగ్నల్‌గడ్డ వద్ద ఉన్న అంబేడ్కర్ సర్కిల్‌ను పరిశీలించి.. తగు నిర్ణయం తీసుకుందామని అఖిలపక్ష నాయకులతో అన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.మురళి, సీతారాం, రామ్మోహన్, ఎంబీ బాలకృష్ణ, రంజిత్‌బాబు, ముచ్చర్ల కృష్ణయ్య, మీనాజ్, సాహితీరెడ్డి, సత్యం, హాఫీజ్, కౌన్సిలర్లు ఉమాశంకర్‌గౌడ్, రమేశ్, ప్రశాంత్‌రెడ్డి, నందకిషోర్‌గౌడ్ పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా తిరంగా యాత్ర



జడ్చర్ల టౌన్: ఉగ్రదాడిని నిరసిస్తూ భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో శనివారం జడ్చర్ల పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత సైనికులకు మద్దతుగా శలావణ్య, వేణుగోపాల్ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా యాత్ర.. ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ప్రారంభమై ప్రధాన రహదారి గుండా నేతాజీ చౌరస్తాకు చేరుకుంది. ర్యాలీ పొడవునా సైనికులకు వందనాలు తెలుపుతూ.. జై భారత్, ఉగ్రవాదం నశించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

'సాగునీటి కాల్వలను పూడ్చడం సరికాదు'



దోకూర్ సమీపంలో పూడ్చిన కాల్వను పరిశీలిస్తున్న ఆర్డీఓ నవీన్

దేవరకద్ర: సాగునీటి కాల్వలను పూడ్చివేయడం సరికాదని మహబూబ్‌నగర్ ఆర్డీఓ నవీన్ అన్నారు. మండలంలోని డోకూర్, గోపన్‌పల్లి, దేవరకద్ర పరిధిలో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాల్వలను కొందరు పూడ్చివేసి పంటలను సాగు చేసుకుంటున్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు శనివారం ఆయన కాల్వలను పరిశీలించారు. సాగునీటిని అందించే కాల్వలను ఇలా పూడ్చివేయడం తగదని.. దీన్ని వల్ల ఇతర రైతులకు సాగునీరందని పరిస్థితులు వచ్చాయని తెలిపారు. సాగునీటి కాల్వలను పూడ్చివేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే సహించమన్నారు. ఎక్కడెక్కడ కాల్వలను పూడ్చివేశారో పరిశీలించి వివరాలను సేకరించారు. కాల్వల పరిశీలనలో తహసీల్దార్ కృష్ణయ్య, డీఈ చందు, ఆర్ఐ శరత్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే జయరాములుకు ఘన నివాళి



జయరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక తెలంగాణ చౌరస్తాలో శనివారం బీసీ సమాజ్ ఆధ్వర్యంలో వనపర్తి మాజీ ఎమ్మెల్యే జయరాములు యాదవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ.. 1978లోనే వనపర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన జయరాములు యాదవ్ నిరంతరం పేదల పక్షాన నిలబడి సేవలందించిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ముగ్గురు బీసీలు ఎమ్మె ల్యేగా గెలిచిన వనపర్తిలో కొంతకాలంగా బీసీలు గెలవకుండా.. అగ్రవర్ణ ఆధిపత్య కులాల నాయకులు ఎమ్మెల్యేలుగా చలామణి అవుతున్నారని అన్నారు. భవిష్యత్‌లో వనపర్తిలో బీసీల గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, శేఖరాచారి, ప్రేమ్‌సాగర్, మహేందర్, బుగ్గన్న, నారాయణ యాదవ్, వెంకట్రాములు, సత్యనారాయణ సాగర్, సుకుమార్, అశ్విని సత్యం, రామానంద్, ఆంజనేయులు, మంగ శ్రీను, తాయప్ప, వీరప్ప, లక్ష్మణ్ నాయక్, వేణుగౌడ్, దస్తయ్య, రాములు, మహేశ్, రాజు పాల్గొన్నారు.

రెండోరోజు రూ.20,500 జరిమానా వసూలు



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు తదితరాలు అమ్ముతున్న, వినియోగిస్తున్న దుకాణ దారులపై రెండోరోజు శనివారం మున్సిపల్ అధికారుల దాడులు కొనసాగాయి. క్లాక్‌టవర్, మార్కెట్ ఏరియా, బోయపల్లిగేట్, సుభాష్‌నగర్, ఎర్రసత్యం చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, పాతబస్టాండు, కొత్త బస్టాండు, షాషాబ్‌గుట్ట, న్యూటౌన్, మెట్టుగడ్డ, ఎనుగొండలోని సుమారు 170 దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 120 మైక్రాన్ మందం కంటే తక్కువ బరువు కలిగిన మొత్తం 102 కిలోల ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 15 మంది యజమానులకు రూ.20,500 జరిమానా విధించారు. ఇందులో ఎనుగొండ బైపాస్ కూడలిలోని పిస్తాహౌస్, కొత్త బస్టాండు ప్రాంగణం లోని విఘ్నేశ్వర ఉడిపి హోటల్ నుంచి రూ.ఐదు వేల చొప్పున వసూలు చేశారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వజ్రకుమార్‌రెడ్డి, గురులింగం, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట పొలాల్లో సీసీరోడ్డు నిర్మాణం

- అడ్డుకున్న రైతులు.. తహసీల్దార్‌కు ఫిర్యాదు



వ్యవసాయ పొలాల్లో సీసీరోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతులు

దేవరకద్ర: కౌకుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలోని పంట పొలాల్లో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం రైతులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కౌకుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర వేర్ హౌసింగ్ గోదాములకు గూడ్స్ వాహనాల రాకపోకలతో ఇబ్బంది అవుతుందని గతంలో ఇక్కడి రైల్వే గేటును మూసివేశారు. బస్సులు, ఇతర వాహనాలను పుట్టపల్లి మీదుగా మళ్లించారు. తాజాగా మూసివేసిన గేటు నుంచి గోదాముల వరకు సీసీరోడ్డు వేస్తుండటంతో పలువురు రైతులు కొంత భూమిని కోల్పోయే పరిస్థితి వచ్చింది. దీంతో బాధిత రైతులు సీసీరోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దౌర్జన్యంగా తమ భూముల్లో రోడ్డు నిర్మిస్తున్నారని.. తమ భూములను కాపాడాలని రైతులు నీలి చంద్రశేఖర్, రవి, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, గొల్ల వెంకటన్న, రాచాల నర్సింహులు తదితరులు కోరారు. కాగా, పాత రోడ్డుపై కూడా సీసీ నిర్మించడంపై సంబంధిత ఆర్అండ్‌బీ ఏఈ శ్రీరామ్‌ను వివరణ కోరగా.. ఎలాంటి అనుమతి లేకుండా ఆర్అండ్‌బీ రోడ్డుపై సీసీ వేస్తున్నారని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.